# విపులాచ పృథ్వీ

ఆడదానికి, పుట్టుకతోనే ఆర్థిక పారమార్థిక స్వాతంత్ర్యం వారసత్వంగా ఏర్పరచని మన ధర్మశాస్త్రం మీద–ఆ ధర్మపన్నాలన్నీ పన్నిన ఋషుల ఆమ్‌టీస్ – తరంవాణ్ణి, నామీద – ఆ చిన్నదాని కళ్ళు శివశక్తుల్లాగ భగ్‌మని పోతున్నాయి.

నేను అసలు సజావైన మనిషినే – దురుసువాణ్ణి కాను: మాట తొణకను. కాని ఉత్సాహంకొద్దీ మాట్లాడటంలో ఎదుట ఉన్నది మగవాడో, ఆడదో – ఆసంగతి మరచిపోతూంటాను.

ఇంతకూ నేను ఏమన్నాను చెపుమా?

అసలు దేనిమీద మాట్లాడుతున్నామూ?–

నేను ఎవరు, ఆ చిన్నది ఎవరు?

నేను ఎవరో తెలుసుకోవాలని మీకు ఎన్నడన్నా ఉబుసుపోకకు కుతూహలం కలిగితే – నేనంటే గిట్టనివాళ్ళు కొందరు ఉన్నారు: వాళ్ళని అడిగితే నా దుర్గుణాలన్నీ నిష్పాక్షికంగా వాళ్ళు చెప్పగలరు. ఎందుచేతనంటే సుగుణాలనేవి ప్రతి జీవరాశికీ ఉండేవే కనుక. అవి అంటే నాకు, మీకు అంత గౌరవంలేదు. ఒక మనిషి సంగతి సిసలుగా తెలుసుకునేందుకు అవి ఎంతమాత్రమూ ఉపక

రించవు. సరే, దీనికేంగాని... నేను ఫలానావాడినే అనుకోండి.

ఆ చిన్నది ఎవరా?-

ఎవరో ఆ వైనం తెలుసుకునేదాకా రానేలేదు: ఇంతలోకే, చూస్తుండగానే ముదిరింది పాకం-

ఎవరైతేనేం గాని...

'అయ్యో:...ఇమగోనండి మిమ్మల్నేనండీ-' అన్నది. నాకళ్ళకూ ఆపిల్లకూ, అంతకుముందే వచ్చిన పత్రిక అడ్డం ఉండిపోయింది ... కాని, ఆ గొంతులో పడుచుతనం, నాచేత జవాబు పలికించింది.

అది, మూలుగో, సణుగుడో తెలియదు కాని... కడుపులో మెసిలిన గంపెడు వాక్యాలు కదంబంగా - ఒక్క నిట్టూర్పుగా ధ్వనించినవి...

'బాబూ! పేదవాళ్ళం...'

ఈ ముక్క, నే నెరుగున్నంతవరకూ చాలినవాళ్ళందరికీ అతివినయంగా అలవడిన దుర్గుణం - ఇదీ అంతేకదా అనుకున్నాను...

'పేదవారు ధన్యులు. దే...వుని రాజ్యము వారిది...' అంటూ అపచారంగా నవ్వాను...నవ్వుతూ ఆ చిన్నదాని వంక చూస్తున్నాను.

చూస్తుండగా క...ళ్ళు కొరమారినవి: నవ్వు పూడిపోయింది...గొంతుక మండి గుండు తిరిగింది.

ఆ చిన్నది...మా అమ్మకన్న ఎన్నో రెట్లు అందంగా

ఉంది...మా చిన్నచెల్లెలికంటే ఎంతో అబ్బనాకారంగా ఉంది...

"ఏమమ్మా దా...ఇలా...కూర్చో..."

ఊహు...నావంటి పెద్దల ఎదుట ... నా సరసను కూర్చునేందుకు ఆ పేదరాసి పెద్దమ్మకు యోగ్యత ఉందా?- అంత అపచారం చేస్తుందా? అమ్మో...

నేను భాగ్యవంతుణ్ణి, అదృష్టశాలిని...పెద్దవాణ్ణి...

నాకు కూలబడితే ఓపట్టాన తేలిగ్గా లేవలేనంత ఒళ్లు ఉంది—పెద్దల దయాధర్మాన నన్ను కట్టుకుపోయేంత—లంకంత కొంప ఉంది. ఏతరంవారో కూడబెట్టిన పాపాన—అదనుకు అక్కరగా పర్సులో పదో పాతికో ఆడుతూన్నవి... కలియుగానికి ఇంకా ఒక్క కాలు మిగిలి ఉన్నందువల్ల—నా నెత్తిన ఏమూలనో గోష్పాదమంత మేర ఆయుకట్టులో ఉంది...ఇవి భాగ్యవంతుడి చిహ్నాలని తల్లి కడుపులో ఉండగానే ఆ చిన్నది...విన్నది.

సహజ ఔదార్యమంతా ప్రకటిస్తూ నేను దానం చేసే పరకో పాతికో—ఆతల్లికి ఆపూట కడుపునింపుతుంది-నాలాంటి తలకుమాసిన ఏబ్రాసులు యీ గడ్డమీద ఎందరు లేరు?-మా అందరి కళ్ళకూ అయాచితంగా ఆ చిన్నది పండువుచేసి పోతుంది. పోతుందా?

"కూర్చో అమ్మా!"

-భయపడుతూ - ముళ్ళమీద కూర్చున్నట్టు ఉంది- నేను, పరకాయించి అదేపనిగా తేరిపారజూస్తూంటే -

ఆకళ్లకు భయం ముంచుకొచ్చింది. ఆమొగం బిక్కమొగ మైంది.

'నీవు పేదరాలి వమ్మా?

ఆ అమ్మాయికి అర్థంకాలేదు. కాని, ఆ చూపులకు నాచేత నేనన్నమాట విప్పి చెప్పించుకోగల ధీమా లేదు. నావంక చూడక—నేను చేరగిలపడిన కుర్చీనీ - నాచేతిలో ఉక్కిరిబిక్కిరౌతూన్న పత్రికనూ - నా మణికట్టును కట్టుకొని ప్రాకులాడే గడియారాన్నీ — 'అయ్యగారు అన్న మాటకు అర్థం ఏమిట'ని అడిగితే - విడబరచి చెప్పేటంత నోరూ — వాయా వాటికి ఎక్కడిది?

'ఏమమ్మా - బంగారంలాంటి ఒళ్ళు—రతనాలవంటి పళ్ళు - నీలాలు ధిక్కరించే కళ్ళు - యింత సంపద నీవు ఒక్కరైవూ ఏంజేసుకుంటావమ్మా? నీకే పేదరికమైతే - ఇక మా అందరిమాట ఏమిటి?

-నేను, ఇంకా నవ్వుతున్నాను - ఆ చిన్నదాని మొగం ఏకంగా మెక్సికో - రోజా అయిపోతూంది...

'బాబూ - కులానికి పేదలం కాని-' గులాబీ రేకలు తతిమ్మా అర్థాన్ని నిప్పులు చెరిగినవి -

-నేను యింకా నవ్వుతూనే ఉన్నాను - అవును, నేను రాక్షసుణ్ణి ఆ చిన్నది - వెక్కి వెక్కి ఏడుస్తూన్నది.

-అచ్చమైన ఆడపిల్ల ఏడుస్తూన్నప్పుడు అందంగా ఉంటుందని... ఈ చిన్నది కలగన్నదా? ... ఒక్క నిమిషంలో నేను పంచకావ్యాలూ...ఆ కళ్ళ కొలుకుల్లో పఠిరచాను...

లేచి వెళ్ళిపోతూంది...

"ఎక్కడికి పోతావ్?"– నా గొంతులో ఏకోశానా దయాదాక్షిణ్యాలు లేవు... నేను పుట్టినప్పటినుంచీ బస్తీల్లోనే పడిఉండి, ఎన్నడూ అరణ్యం మొగం అంటూ చూడని పాపాన ... పులి గాండ్రుమన్నప్పుడు లేడిపిల్ల కదలలేక ఎలా గజ-గజలాడిపోతుందో ఆ పోణిమి ఎరుగను... కాని, బాధ చూస్తుంటే మనసుకు అబ్బే శాంతి-యిప్పుడు అర్థమాతూంది...

'వచ్చి...ఇలా కూర్చో'

దక్కుస్తూ ... రాక ఏంచేస్తుంది?– వంటయింటి కుందేలు...

'అనగా–అనగా ఓ రాజు ఉండేవాడు ... ఆ రాజు పేరు, నీకు నోరు తిరుగదుగాని... ఊఁకొట్టవేం...?'

ఆకళ్లు...తల్లిగర్భంలో తన్నుకునే శిశువులాగా... మూగయాతన పడుతున్నాయి...'ఊఁ' – గా మెడనరాలు కదలినాయి...

"ఆ రాజుగారి దర్బారులోకి ... ఒకనాడు ... ఓ పేదపిల్ల వచ్చింది...పేదపిల్లంటే...అచ్చంగా పేదపిల్లే... మొలచుట్టూ చాలిన కోక లేదు ... రొమ్ము జుట్టుతో కప్పుకుంది...అడుగుతీసి అడుగు వేసినప్పుడల్లా ఒళ్లంతా బట్ట-బయలౌతూంది..."

–ఆ చిన్నది...సిగ్గుతో భూమిలోకి క్రుంగిపోతూంది. అణగి మణగిపోతూంది...

'సభలో ఉన్నవాళ్ళందరూ తల తిప్పేసుకున్నారు...

రాజుగారికి మాత్రం ఆ అలవాటు లేనందువల్ల అలాగే చూస్తూ కూర్చున్నాడు...క్రమంగా ఒక్కొక్కరే సభలో వాళ్ళందరూ, చల్లగా బయటికి జారుకున్నారు ... సభ బావురుమంటూంది ... సింహాసనంమీద రాజు ... మెట్ల క్రింద ఆ పిల్ల...వాళ్ళిద్దరే మిగిలారు..."

-కుర్రది, యీదురులో గిజిగాడులాగా ఉంది. తల ఎత్తకుండా కళ్లు మలపకుండా...చుట్టుపక్కల యావత్తూ ఒకసారి చుట్టేసింది...ఎక్కడా ఎవరూ లేరు ... మేము యిద్దరమే మిగిలాము.

'అప్పుడు ఆ రాజు ఏంచేశాడో తెలుసురా? ... కూర్చున్న చోటునుంచి, క్రిందికి దిగివచ్చి, ఆ పిల్లను...

-నాకు ఎందుకో భయంవేసింది ... కాని, చెప్పక తప్పదు...

...'ఆ పిల్లను- పెళ్ళిచేసుకున్నాడు...'

పిడుగుపడినంత నిశ్శబ్దం మారోగింది... ఆ చిన్న దాని కళ్లూ, పెదవులూ, ఎండిపోయినాయి...ఎడం చెక్కిలి మీద, సగం యింకిపోయి ముత్యమంత ఓ చుక్క. తొణికిస లాడుతూంది...

..."మంచిపని చేశాడుకాదూ..."

ఆ చిన్నదాని మెడ, వెనక్కు విరుచుకుంది-గొంతు చాయల నరాలు కదను తొక్కుతున్నాయి ... కణతను పుణుకున్న లేతనరంతీగె కళుక్కుమంటూంది.

"నన్ను...పెళ్ళి...చేసుకుంటారా?"

...నిన్న, మా చెల్లెలి మనుమరాలు అడిగిందికదా...

'తాతయ్యా! నిప్పు కరుస్తుందా?...' అప్పుడు ఆ పసికుంక తీరూ, చూపూ ఇలాగే ఉంది...

"ఓఁ...తప్పకుండా!...యింతకన్నా నాకు కావలసిన దేముందీ?"

...సప్త సముద్రాలలోనూ ఆదికాలంనుంచీ మనకు అందకుండా పేరుకుపోయిన ముత్యాలన్నీ ... ఆ కళ్ళు పంతంగా కురిపిస్తున్నాయి...చూడ ముచ్చటగానే ఉంది కాని... చెప్పొద్దూ, ఇక నాకు నవ్వు ఆగడంలేదు..."

ఏమిటి కేడ్చెదవానన తామరసంబెత్తిచూడు,'

అర్థంకాక, తలఎత్తి నావంక బిక్కగా చూస్తూంది... నేను పకాల్మన్నాను...

'కోమల కటాక్షవీక్షా దామకమున వీరసేన తనయున్...'

గుమ్మంలో నిలుచుని...మా తాత తండ్రుల ఆస్తి పాస్తు లన్నింటికీ జ్యేష్ఠవారసుడు...ఇవతల అడుగు వేయడానికి సందేహిస్తున్నట్టు...కళ్ళకెదురుగుండా ఉన్న అద్దం, దాఖల్ చేస్తూంది...సరే...బాగానే ...ఉంది

'ఇక నీకు తప్పదమ్మాయ్! నీవు ఏమనుకున్నా సరే...పెళ్ళిచేసుకు తీరాలిసిందే..." — చాలా నిష్కర్షగా అన్నాను.

అందుకు ఆ చిన్నది, ఏమంటుంది? ... గర్జిస్తుందా, గాండ్రిస్తుందా? ఇల్లుతీసి, పందిరి వేస్తుందా? చిగురుతొడిగీ నవనవలాడుదామనుకునే లతకూనకు శివమెత్తి ప్రళయ హుంకారం చేసినప్పుడు మెరసే సమ్మోహనంకోసం యీ

కళ్ళు ఎన్నో యుగాలనుంచి, కాయలుకాసి పోయినవి. కాని, ఆదికాలంలో వేదాలకోనలో, ప్రకృతి, ఒక్క రుద్రమూర్తికే ఆ వరం యిచ్చింది...ఆ తరువాత, నాటి నుంచి నేటిదాకా అంతటి భయంకర సౌందర్యాన్ని భరించ గల మొగవాడెవడూ పుట్టనేలేదేమో...ఏమో. ఆ సంగతు లన్నీ మన కెందుకుగాని...

ఆ చిన్నది ... బంగరుబొమ్మై అలాగే నిలువబడి పోయింది...పెదపాటి ఎర్రన్న మల్హణ చరిత్రంలో, ఆ సీస పద్యం మీకు జ్ఞాపకం ఉందా? లేకపోతే మానె...పాపన్న ఉత్తరరామాయణం విప్పి...రంభ బలవంతాన అలసిసొలసి అత్తవారింటి చాయలకు అడుగుతీసి అడుగు వేస్తున్నప్పుడు పాపన్న సీసంలో పడ్డబాధ...అన్నిపాదాలూ చదవండి... నాకు పదితలకాయలు లేవు ... ఇరవైచేతులు లేవు ... ఈక్షణంవరకూ గోరంత అయినా పాపంచెయ్య పూనుకో లేదు...కాని, ఆ చిన్నది ... ఆ నిమిషంలో మౌనంగా సహిస్తున్న బాధ...మీరుకాదు ... మీకన్న కొమ్ములు తిరిగినవాళ్ళే చూడలేరు...

'అమ్మాయ్?' ... కూర్చున్న చోటనుంచే అన్ని గదులలోకి కూలంకషంగా వినబడి తీరవలసిన పొల్లుకేక పెట్టాను...

"ఆఁ...అనుకుంటూ, ఒక అమ్మాయి అవతరించింది ...ఊఁ' అని దానికన్న చిన్నది చనువుగా ముద్దులు గుడిచింది...

'ఎందుకు నాన్నా!' అని ఇద్దరూ, తలొక శ్రుతిలోనూ అన్నారు.

"...లోపలికి తీసుకువెళ్ళి పెళ్ళికూతుర్ని చేసి తీసుకు రండమ్మా!..." ఆ చిన్నదాని వేపు తల విసిరాను.

'సై' అన్నట్టు యిద్దరూ ఎగిరి గంతువేశారు. ఇక్కడ ఒక అప్రస్తుత విషయం ఉద్ఘాటించి తీరాలి... నా నోటినుంచి ఏముక్కన్నా వచ్చేదే వ్యవధానంగా, మా పిల్లలు, యిలాగే అవును-కాదు-అనకుండా పరితిపనీ చేస్తారు...మంచి వినయ విధేయతలు వున్నాయి...బుద్ధిమంతనపు పిల్లలు...అని అనుకుంటారేమో? వాళ్లు నట్టి రాలుగాయలు సుమండీ ... నేనన్నమాట అర్థమైందని, కాదు: కాని, నేనేదో పాడుపని తలపెట్టానని...ఏదిచెప్పినా చిటికలో చేస్తారు నా దుర్మార్గంమీద, వాళ్ళకు అంత ఘుట్టినమ్మకం...

—(o)—